క్లుప్తంగా

భార్గవ్‌కు గణపతి లడ్డూ బహూకరణ



సజ్జల భార్గవ్‌కు లడ్డూ బహూకరిస్తున్న కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి తదితరులు

పెదగంట్యాడ: గణపతి ఉత్సవాల సందర్భంగా విశాఖ సాగరతీరంలో ఏర్పాటు చేసిన చాక్లెట్ గణపతికి నివేదించిన 50 కిలోల లడ్డూను వేలం వేయగా 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి సొంతం చేసుకున్నారు. ఈ లడ్డూను ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి తనయుడు, సోషల్ మీడియా రాష్ట్ర అధ్యక్షుడు సజ్జల భార్గవ్‌తో పాటు అర్జున్‌రెడ్డికి మంగళవారం అందజేశారు.

అప్పన్నకు ఘనంగా ఆర్జిత సేవలు



నిత్యకల్యాణంలో జీలకర్రబెల్లం ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: ఏకాదశి సందర్భంగా శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం ఆర్జిత సేవలు ఘనంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణ తులసీ దళార్చన నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవింద రాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణ మండపంలో కొలువుదీర్చి ఉభయదాతలను స్వర్ణ తులసీదళాలతో ప్రదక్షిణ చేయించారు. అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహిస్తూ 108 స్వర్ణతులసీ దళాలతో అర్చన చేశారు. ఉభయదాతలకు స్వామిఏ శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఏఈవో భ్రమరాంబ, సూపరింటెండెంట్ సునీల్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

విశేషంగా నిత్య కల్యాణం

శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్య కల్యాణం విశేషంగా జరిగింది. ఉదయం 9.30 గంటలకు ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై ఉత్సవమూర్తులను వేంజేపజేసి, కల్యాణోత్సవం జరిపించారు.

కూడళ్ల అభివృద్ధి పనులు వేగవంతం

జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ



మహారాణిపార్లర్ కూడలి అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కమిషనర్ సాయికాంత్ వర్మ

సీతంపేట: స్మార్ట్ సిటీ పనుల్లో భాగంగా నగరంలో పలు కూడళ్లలో చేపడుతున్న అభివృద్ధి, రోడ్ల విస్తరణ పనులు వేగవంతం చేయాలని జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులను జీవీఎంసీ కమిషనర్ సి.ఎం.సాయికాంత్ వర్మ ఆదేశించారు. జీవీఎంసీ జోన్ 3,4,5 పరిధిలోని ప్రభుత్వ ఛాతీ ఆస్పత్రి రోడ్డు, ఏఎస్ఆర్ కాలేజీ గ్రౌండ్ జంక్షన్, అక్కయ్యపాలెం మహారాణి పార్లర్ జంక్షన్, న్యూకాలనీ జంక్షన్ వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను మంగళవారం కమిషనర్ పరిశీలించారు. పెదవాల్తేర్ పోలమాంబ గుడి ఎదురుగా ఉన్న ప్రభుత్వ ఛాతీ ఆస్పత్రి రోడ్డులో విస్తరణ పనులతో పాటు సెంటర్ మీడియన్, గ్రీనరీ అభివృద్ధి పనులు వేగవంతం చేయాలన్నారు. రోడ్డు విస్తరణకు అడ్డంగా ఉన్న చెట్లకు ఎటువంటి నష్టం కలగకుండా రోడ్డు పక్కన గ్రీనరీ ప్రాంతంలోకి మార్పు చేయాలని ఆదేశించారు. నగరంలో రద్దీ దృష్ట్యా స్మార్ట్ సిటీ నిధులతో రోడ్ల విస్తరణతోపాటు కూడళ్లను అభివృద్ధి చేస్తున్నట్టు కమిషనర్ తెలిపారు. ఈ పనుల సందర్భంగా కూడళ్లలో ఉన్న విగ్రహాలకు హాని కలగకుండా చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు.ఎస్ఈలు వినయ్‌కుమార్, వేణుగోపాల్, జోనల్ కమిషనర్లు విజయలక్ష్మి, శివప్రసాద్, ఆర్.జి.వి.కృష్ణ, ఏపీయూఐఏఎంఎల్ ప్రతినిధి చేతన్, ఈఈ మత్స్యరాజు, ఏఎంవోహెచ్‌లు రాజేష్, సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

ఆహారం సురక్షితమేనా?

- కల్తీపై కానరాని చర్యలు
- ఆందోళన చెందుతున్న వినియోగదారులు

గాజువాక: ఆహారమే మనకు ప్రాణాధారం.. సక్రమంగా తీసుకుంటే అదే అమృతం, ఔషధం. అందులో ఏ మాత్రం తేడా వచ్చినా అదే విషంగా మారి ప్రాణాల మీదికి తీసుకువస్తుంది. ఇటీవల గాజువాకలోని ఓ రెస్టారెంట్‌లో ఆహారం కలుషితమై పలువురు వాంతులు, విరేచనాలతో ఆస్పత్రిలో చేరిన ఉదంతమే ఇందుకు నిదర్శనం. దీంతో హోటళ్లలో, రెస్టారెంట్లలో ఆహార పదార్థాల నాణ్యత వినియోగదారులను కలవరపెడుతోంది.

లాభాపేక్షే ధ్యేయంగా..

తినే ఆహారంలో కల్తీ.. కొనే కూరగాయల్లో కల్తీ.. మాంసాహారంలో కల్తీ. గాజువాకలో ఎక్కడ చూసినా ఇదే పరిస్థితి ఉంది. లాభాపేక్షే ధ్యేయంగా నిషేధిత మసాలాలు, ఆహార రంగులను, వివిధ రసాయనాలను యథేచ్ఛగా వినియోగిస్తున్నారు. దీనిపై సంబంధిత విభాగం అధికారుల హెచ్చరికలను సైతం పెడచెవిన పెడుతున్నారు. పప్పు దినుసులు మొదలు హోటళ్లలో తినే ఆహార పదార్థాల వరకు అన్నింటిలోను కల్తీ చోటు చేసుకుంటోందని జనం గగ్గోలు పెడుతున్నారు. ఆహారంలో కల్తీకి జనం అనారోగ్యం పాలవుతున్నారు. ఒక్కోసారి అస్వస్థతకు గురై ప్రాణాలమీదకు తెచ్చుకుంటున్నారు.

జాడ లేని అధికారులు

గాజువాకలో హోటళ్లు, స్నాక్స్ రెస్టారెంట్లు ఇబ్బడి ముబ్బడిగా వెలుస్తున్నాయి. యువతను ఆకర్షించడం కోసం ఆయా రెస్టారెంట్లు రకరకాల ఆహార పదార్థాలను అందుబాటులో ఉంచుతున్నాయి. వాటికి ఇష్టానుసారం రేట్లు వసూలు చేస్తున్నాయి. వాటి నాణ్యత, రెస్టారెంట్లలో సౌకర్యాలపై అధికారులు స్పందించడం లేదనే విమర్శలున్నాయి. రెస్టారెంట్ల నిర్వహణను పరిశీలించాల్సిన జిల్లా ఫుడ్ క్వాలిటీ కంట్రోల్ అధికారుల జాడ ఇక్కడ కనిపించడం లేదు. దీంతో రెస్టారెంట్ల నిర్వాహకులు



గాజువాకలో ఫుడ్ పాయిజన్ జరిగిన మండీ క్రూడ్స్ రెస్టారెంట్

తమకు ఇష్టమొచ్చినట్టు ఆహార పదార్థాలను తయారు చేస్తున్నారు. నిషేధిత మసాలాలను, నిమ్మ ఉప్పు వంటి ప్రమాదకరమైన వాటిని కూడా రుచి కోసం పదార్థాలలో కలిపేస్తున్నారని వినియోగదారులు గగ్గోలు పెడుతున్నా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. తాజాగా గాజువాకలోని ఒక రెస్టారెంట్‌లో భోజనం చేసిన పది మంది ఆస్పత్రిపాలవడంతో అధికారుల తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

- మార్కెట్లలో పలు కూరగాయలకు రసాయనాలతో కూడిన రంగులు వేసి విక్రయాలు జరిపిన సంఘటనలు గతంలో వెలుగు చూసిన విషయం తెలిసిందే. రంగు వేసిన పచ్చిబఠానీ విక్రయాలపై అధికారులు కేసులు రాసిన విషయం తెలిసిందే.
- పళ్ల విక్రయాల్లో రసాయనాల వాడకం పతాక స్థాయిలో ఉంది. పళ్లను గమనిస్తే అది స్పష్టంగా తెలుస్తుంది. మార్కెట్‌లో కొనుగోలు చేసి ఇంటికి తీసుకొచ్చేసరికి చాలా పళ్ల స్వభావం మారిపోతున్న సంఘటనలున్నాయి. అలాంటివాటిపై అధికారులు స్పందించాలని వినియోగదారులు కోరుతున్నారు.
- మాంసం విక్రయాల్లోను అనేకచోట్ల కల్తీ చోటు చేసుకుంటోంది. జీవాలను కబేళా వద్ద కాకుండా దుకాణాల వద్దే వధిస్తున్న సంఘటనలూ ఉన్నాయి. ఇందులో కల్తీలపై వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. ఆహార భద్రతాధికారులు కఠిన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

ఒకే ఒక్కడు

గాజువాక ప్రాంతంలో ఆహార పదార్థాల్లోని కల్తీని అరికట్టడానికి నియమించిన ఆహార భద్రతాధికారి జిల్లాలో సగం ప్రాంతాన్ని చూసుకుంటున్నారు. దీంతో ఆయన ఇక్కడ పూర్తిస్థాయిలో దృష్టి సారించలేకపోతున్నారనే విమర్శలున్నాయి. గతంలో జిల్లా ఫుడ్ క్వాలిటీ కంట్రోల్ అధికారులకు జీవీఎంసీ శానిటరీ ఇన్‌స్పెక్టర్లు సహాయకులుగా ఉండేవారు. కొన్నేళ్ల క్రితం వారిని బాధ్యతల నుంచి తొలగించారు. జీవీఎంసీ పరిధిలో ఆహార పదార్థాల నాణ్యత పరిశీలన బాధ్యతలను తమ సిబ్బందికి అప్పగించాలని గతంలో కమిషనర్ ఫుడ్ సేఫ్టీ కమిషనర్‌కు లేఖ రాసినా ఫలితం లేకుండా పోయిందని జీవీఎంసీ ప్రజారోగ్యాధికారులు తెలిపారు.

ఎప్పటికప్పుడు తనిఖీలు

గాజువాకలోని రెస్టారెంట్లలో ఎప్పటికప్పుడు తనిఖీలు చేపడుతున్నాం. ఈ ఏడాది ఎనిమిది కేసులు నమోదు చేశాం. కొన్ని రెస్టారెంట్లలో సింథటిక్ ఫుడ్ కలర్స్ వాడుతున్నట్టు తెలుసుకొని వారికి హెచ్చరికలు జారీ చేశాం. ప్రస్తుతం ఆరు నెలలుగా రెస్టారెంట్ల నిర్వాహకుల్లోను అవగాహన పెరిగింది. గాజువాక మండీ క్రూడ్‌లో ఫుడ్ మెటీరియల్ శాంపిళ్లను సేకరించి ల్యాబ్‌కు పంపించాం. ప్రస్తుతం రెస్టారెంట్ మూసివేతలో ఉంది.

– శ్రీనివాసరావు, ఆహార భద్రతాధికారి

చురుగ్గా జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే



రక్త పరీక్ష చేస్తున్న వైద్య సిబ్బంది



ఎరుకుల వీధిలో వృద్ధురాలికి బీపీ పరీక్షిస్తున్న సిబ్బంది

కూర్మన్నపాలెం: జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే 87వ వార్డులో చురుగ్గా జరుగుతోంది. వార్డు పరిధిలోని సిద్దార్థ నగర్, వడ్లపూడి, కణితి కళింగవీధి, ఎరుకులవీధి, కూర్మన్నపాలెం, కాపుజగ్గరాజుపేట, తిరుమలనగర్ తదితర 9 సచివాలయాల పరిధిలో వైద్య ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ తిరుగుతూ ప్రజలు ఆరోగ్య వివరాలను యాప్‌లో నమోదు చేస్తున్నారు. కణితి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని వైద్యాధికారులు, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు, వలంటీర్లు, నర్సింగ్ విద్యార్థులు చేస్తున్న సర్వేను ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తూ సలహాలు, సూచనలు ఇస్తున్నారు. జగనన్న ఆరోగ్య సురక్షపై ప్రజలకు అవగాహన కల్పించి, అవసరమైన వైద్య పరీక్షలు, రక్త పరీక్షలను ఇంటి వద్దనే చేస్తున్నారు.

28, 30, 31 తేదీల్లో శిబిరాలు

వైద్యారోగ్య సిబ్బంది సర్వే సమయంలో వ్యాధులను గుర్తించడంతో పాటు వారి వివరాలను ఫొటోలతో సహా యాప్‌లో నమోదు చేస్తున్నారని కణితి పీహెచ్‌సీ వైద్యాధికారి శివయ్య తెలిపారు. అక్టోబర్ 28, 30, 31 తేదీల్లో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు ఏర్పాటు చేసి ఆరోగ్య సమస్యలు ఉన్న వారికి, సర్వేలో గుర్తించిన రోగులకు చికిత్స అందిస్తామన్నారు. ప్రజలు ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

భెల్ యాజమాన్యంతో ఎంపీ జీవీఎల్ సమావేశం



భెల్ ఈడీ జితేందర్ రెడ్డితో మాట్లాడుతున్న ఎంపీ జీవీఎల్

అక్కిరెడ్డిపాలెం: బీహెచ్‌ఈఎల్ విశాఖ యూనిట్‌ను రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు మంగళవారం సందర్శించారు. సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్.జితేందర్ రెడ్డి, ఇతర ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. అధికారులు మాట్లాడుతూ భెల్ ప్రతీ సంవత్సరం వేతనాల కోసం రూ.110 కోట్లు వెచ్చిస్తోందన్నారు. రెండేళ్ల క్రితం సంస్థ ఆదాయం రూ.70 కోట్లు ఉండగా, గత ఆర్థిక సంవత్సరంలో రూ.220 కోట్లు సాధించిందని తెలిపారు. వచ్చే ఏడాది రూ.350 కోట్ల వార్షికాదాయం లక్ష్యంగా పెట్టుకున్నామని తెలియజేశారు. సంస్థ హెచ్‌ఆర్ హెడ్ ఎం.వి.ఎస్.ఎస్.రాజు, పలువురు అధికారులు పాల్గొన్నారు. అనంతరం తుంగ్లాం గ్రామం వైపు గల సంస్థ గేటు అంశంపై యాజమాన్యంతో చర్చించారు. గేటు తెరవాలని కోరగా.. ఈ అంశం హైకోర్టు పరిధిలో ఉందని వారు తెలిపారు. అనంతరం ఎంపీ గ్రామనాయకులతో మాట్లాడి ఈ అంశంపై భెల్ కార్పొరేట్ కార్యాలయ అధికారులతో చర్చిస్తానన్నారు. బీజేపీ గాజువాక కన్వీనర్ కరణం రెడ్డి నర్సింగరావు, పప్పు రాజారావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యం

- ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి
- 85వ వార్డులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

అగనంపూడి: రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి పాలన సాగిస్తోందని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. 85వ వార్డు దిబ్బపాలెం, అండమాన్ కొండయ్యవలసల్లో రూ.49.82 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్లకు.. రూ.49.95 లక్షలతో బీసీ కాలనీ, కొత్తూరు, బొర్రమాంబ ఉప్పరకాలనీల్లో నిర్మించనున్న కాలువలు, ప్రహరీ పనులకు ఆయన బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మౌలిక వసతులతో పాటు ప్రజల అవసరాలను గుర్తించి కార్యక్రమాలు చేపడుతోందన్నారు. రెండు వార్డుల్లో విస్తరించి ఉన్న అగనంపూడిలో దాదాపు అన్ని సమస్యలు పరిష్కరించామన్నారు. రైతు బజార్ ఏర్పాటుకు మార్గం సుగమనం అయిందని, కల్యాణ మండపం నిర్మాణం కోసం ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకుడు ప్రసాద్, 79వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి అప్పికొండ మహాలక్ష్మినాయుడు, నాయకులు నక్కా రమణబాబు, బోర సోమునాయుడు, గెద్దాడ సత్యవతి, యలమంచిలి అప్పారావు, శీరంశెట్టి గోవిందరావు, దాసరి సత్యవేణి, కొలపాక అప్పారావు, ఎల్‌వి.రమణ తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

‘జిందాల్‌ను స్టీల్‌ప్లాంట్‌లోకి అనుమతించం’

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లోకి జిందాల్ యాజమాన్యాన్ని అడుగుపెట్టనివ్వబోమని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ స్పష్టం చేసింది. దొడ్డిదారిన జిందాల్‌ను ప్లాంట్‌లోకి తీసుకురావాలనే స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం నిర్ణయాన్ని అంగీకరించే ప్రసక్తి లేదని తేల్చి చెప్పింది. ఉక్కునగరంలోని సీ భవన్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ మాట్లాడుతూ స్థానిక యాజమాన్యం దేశంలోని స్టీల్ తయారుచేసే ప్రైవేటు పరిశ్రమలతో ఈ ప్లాంట్‌ను నడపాలనే ఆలోచనను తక్షణం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. యాజమాన్యం ఆలోచనల వల్ల ప్లాంట్‌కు ఉన్న శాశ్వత వినియోగదారులను కోల్పోవడంతో పాటు ప్లాంట్ అమ్మకాలపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. పోరాట కమిటీ చైర్మన్ సీహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ కార్మికుల ఆందోళనలకు భయపడి నేడు దొడ్డి దారిన ప్లాంట్‌లోని ఒక్కొక్క విభాగాన్ని అమ్మకానికి పెట్టారన్నారు. ఈ చర్యలకు వ్యతిరేకంగా ఈ నెల 12 నుంచి 20వ తేదీ వరకు కార్మికుల్లో పెద్ద ఎత్తున ప్రచారం చేస్తామన్నారు. ఈ అంశాలను రాష్ట్ర ముఖ్యమంత్రికి, ఉక్కు మంత్రికి వివరిస్తామన్నారు. కమిటీ కో–కన్వీనర్ నీరుకొండ రామచంద్రరావు మాట్లాడుతూ ఉక్కు యాజమాన్యం ఏడాది కాలంలో ఇచ్చిన అనేక హామీలను నెరవేర్చడంలో విఫలం చెందిందన్నారు. కమిటీ కన్వీనర్ కె.ఎస్.ఎన్.రావు, జె.అయోధ్యరామ్, వై.మస్తానప్ప, బొడ్డు పైడిరాజు, వరసాల శ్రీనివాస్, డి.అప్పారావు, డి.వి.రమణారెడ్డి, సీ ప్రధాన కార్యదర్శి కె.వి.డి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నర్సింగరావు

బాధితులకు పరామర్శ

పరిస్థితి విషమంగా ఉన్న నలుగురికి సొంత ఖర్చుతో వైద్యమందిస్తానని ఆడారి ఆనంద్ హామీ

మల్కాపురం : జీవీఎంసీ 58వ వార్డు ములగాడ గ్రామానికి చెందిన యువకులు ఆదివారం మధ్యాహ్నం పాతగాజువాక వద్ద ఓ హోటల్లో భోజనం చేసి అస్వస్థతకు గురయ్యారు. బాధితుల్లో ఇద్దరికి మల్కాపురం సెయింట్ ఆన్స్ ఆసుపత్రిలో చికిత్స జరుగుతుండగా, కొంత మందికి నగరంలోని కేజీహెచ్‌లో చికిత్స అందిస్తున్నారు. కొందరు ఇంటి వద్దే చికిత్స పొందుతున్నారు. ఆస్పత్రిలో ఉన్న వారి యోగక్షేమాలను ములగాడ మండల తహసీల్దార్ డి.వీరభద్రరావు, మల్కాపురం సీఐ జి.డి.బాబు, ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్, 58వ వార్డు కార్పొరేటర్ గులిగిందల లావణ్య, సోమునాయుడు తదితరులు అడిగి తెలుసుకున్నారు. ఇదిలా ఉండగా మెరుగైన వైద్యం కోసం బాధితుల కుటుంబ సభ్యులు కోరగా వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ స్పందించారు. బాధితులకు కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో తన సొంత నిధులతో వైద్యం అందించేందుకు ముందుకు రావటంతో బాధితుల బంధువులు ఆనంద్ కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఆస్పత్రి యాజమాన్యంతో మాట్లాడుతున్న తహసీల్దారు వీరభద్రరావు, సీఐ జి.డి.బాబు

బాతు ‘బొప్పాయి’



బాతును పోలిన బొప్పాయి పండు

విశాఖ విద్య: ఎస్‌పీడీ సమీపంలోని మద్రిపాలెం రైతు బజారులో బాతు ఆకారంలో బొప్పాయి ఆకట్టుకుంది. సబ్బవరం మండలం వంగలి గ్రామంలోని తమ పొలంలో వేసిన బొప్పాయి చెట్టుకు కాసిన పండ్లను కోయగా, ఇది కనిపించిందని మహిళా రైతు వి.సత్యవతి తెలిపారు. బాతు ఆకారంలో ఉన్న బొప్పాయి పండును రైతు బజారుకు వచ్చిన వారంతా ఆసక్తిగా తిలకించారు.



మహిళా రైతు సత్యవతి

అలరించిన భక్తి సంగీత విభావరి



సంగీత విభావరిలో పాల్గొన్న కళాకారులు

డాబాగార్డెన్స్: ఇసుకకొండపై వెలసిన రమా సహిత సత్యనారాయణస్వామి ఆలయంలో మంగళవారం ఉదయం 10 నుంచి 12 గంటల వరకు భక్తి సంగీత విభావరి నిర్వహించారు. దేవదాయ శాఖ ఆదేశాల మేరకు ధర్మప్రచార వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రముఖ వీణ, గాత్ర విద్వాంసుడు తోలేటి బుచ్చిబాబు వీణానాదం, గాత్ర సంగీత విభావరి భక్తులను అలరించింది. వారోత్సవాల్లో భాగంగా బుధవారం కూచిపూడి నృత్యాలు, 12న భజనలు, 13న కోలాటాలు, 14న పారాయణం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో బుద్ధ మహాలక్ష్మీ నగేష్ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు ఫణిహారం నరసింహమూర్తి, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

మరో ఐదువేల మంది ఓటర్లకు నోటీసులు



సమావేశంలో మాట్లాడుతున్న ఈఆర్వో లక్ష్మారెడ్డి

గాజువాక: ఇంటింటి సర్వేలో ఆబ్సెంట్, శాశ్వతంగా వలస వెళ్లినట్లు గుర్తించిన 5055 మంది ఓటర్లకు తాజాగా నోటీసు–బీ జారీ చేశామని గాజువాక ఓటర్ల నమోదు అధికారి (ఈఆర్వో) డి.లక్ష్మారెడ్డి తెలిపారు. వివిధ రాజకీయ పార్టీల నాయకులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత వారంలో 6141 మందికి నోటీసులను స్పీడ్‌పోస్టులో పంపించామని, ఇప్పుడు మరో ఐదు వేల మందికి నోటీసులను జారీ చేశామని తెలిపారు. ఈ సందర్భంగా ఆ జాబితాలను పార్టీల ప్రతినిధులకు అందజేశారు. రేషనలైజేషన్‌లో ప్రతిపాదించిన ఓటర్లను సర్దుబాటు చేయడంపై ఎన్నికల సంఘం సాఫ్ట్‌వేర్‌లో అప్‌డేట్ చేసినట్టు తెలియజేశారు. సమావేశంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ప్రసాద్‌బాబు, గాజువాక తహసీల్దార్ శ్రీవల్లి తదితరులు పాల్గొన్నారు.

ఐక్య పోరాటాలతో ‘ఉక్కు’ పరిరక్షణ



దీక్ష శిబిరంలో నినాదాలు చేస్తున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: కార్మికుల పోరాటాల ఫలితంగా ఏర్పడిన విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేట్‌పరం కాకుండా దేశ ప్రజలందరూ ఏకమై కాపాడుకోవాలని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షల్లో 971వ రోజు, మంగళవారం సంస్థకు చెందిన వివిధ విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మహనీయుల ప్రాణత్యాగంతో ఏర్పాటైన విశాఖ ఉక్కు పరిశ్రమను కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరించడం దుర్మార్గమన్నారు. విశాఖ ఉక్కును గురించి ప్రజలందరు కేంద్రప్రభుత్వాన్ని నిలదీయాలన్నారు. సంస్థ కోసం కార్మికులు నిరాహార దీక్ష చేస్తున్నా కేంద్రంలో చలనంలో లేదని.. ఉక్కు పరిశ్రమను కాపాడుకోవడంలో కార్మిక వర్గంతో పాటు దేశప్రజలంతా మమేకం కావాలని కోరారు. ఐక్య పోరాటాలతోనే విజయం సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.


చేతుల పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు సబ్బులు అందజేస్తున్న హెచ్‌ఎం విజయ ప్రశాంతి

గాజువాక: గ్లోబల్ హ్యాండ్‌వాష్ డే సందర్భంగా మ్యాజిక్ బస్ ఆధ్వర్యంలో గాజువాక హైస్కూల్ విద్యార్థులకు చేతుల పరిశుభ్రతపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సబ్బులు అందజేసి చేతులు కడుక్కునే విధానాన్ని వివరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని కె.విజయ ప్రశాంతి మాట్లాడుతూ మన చేతుల్లోనే మన ఆరోగ్యం ఉంటుందన్నారు. చేతులు శుభ్రంగా లేకపోతే క్రిములు, బ్యాక్టీరియా వంటివి మనం తీసుకునే ఆహారం ద్వారా శరీరంలోకి వెళ్లి ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని తెలిపారు. ఎప్పటికప్పుడు చేతులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మ్యాజిక్ బస్ ప్రతినిధులు ఆర్.శంకర్, సరస్వతి, ఎం.గౌతమి, సీహెచ్.నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న జ్యోతి కుమారి

ఏయూ క్యాంపస్: ఆరిలోవ ప్రాంతం తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ప్రాంతీయ విద్యా సంచాలకురాలు ఎం.జ్యోతికుమారి మంగళవారం సందర్శించారు. పదో తరగతి ఎఫ్ఏ 2 పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించారు. రానున్న ఎస్‌ఎస్‌సీ పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించి, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చినగదిలి మండల విద్యాశాఖ అధికారి అనూరాధ, స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయిని జి.కె.డి.భవాని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సింహగిరిపై విశేషంగా ఏకాదశి తిరువీధి



మదనగోపాలస్వామికి తిరువీధి నిర్వహిస్తున్న వైదికులు

సింహాచలం: ఏకాదశి సందర్భంగా సింహగిరిపై మంగళవారం సాయంత్రం మదనగోపాలస్వామికి తిరువీధి నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులను శోభాయమానంగా అలంకరించి పల్లకిలో వేంజేపజేశారు. సింహగిరి మాడ వీధుల్లో తిరువీధి నిర్వహించారు. దివ్యప్రబంధాలను అధ్యాపకులు పఠించారు. విశేషంగా హారతులు అందజేశారు. భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకుడు టి.పి.రాజీవ్‌లోచన్, తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.